# నైజం

**అనపర్తి రాంబాబు**

శిరీష గబగబా నడుస్తోంది.

తనకోసం అతను ఎదురుచూస్తుంటాడు.

విసుక్కుంటాడు. కోప్పడతాడు.

ఒకసారి వాచీవంక చూసింది. అయిదు నలభైఅయిందు. అంటే తను చెప్పిన టైముకంటే నలభై అయిదు నిముషాలు లేటుగా వెళుతోంది.

అవినాష్ ఏమనుకుంటాడు?

అసలతను ఉన్నాడో, వెళ్ళిపోయాడో?

చూసిచూసి రానని కోపంగా వెళ్ళిపోతే!

వెళ్ళడు. ఉంటాడు. ఎంత లేటైనా సరే తను వస్తానన్నప్పుడు వస్తానని అతనికి తెలుసు. తనకోసం ఆశగా ఎదురుచూస్తుంటాడు.

అవినాష్ ఎంత అందంగా ఉంటాడు.

కళ్లు చెదిరిపోయే ఆకర్షణ. నిండైన పర్సనాలిటీ. తనంటే అతనికి ఎంతో ఇష్టం.

తనంటే పడిచస్తాడు.

ఆలోచిస్తూ తాము కలుసుకోవటానికి ముందుగా నిర్ణయించుకున్న స్థలానికి చేరుకుంది. ఆమెను చూడగానే అతనిలోని విసుగు, కోపం పటాపంచలైపోయాయి. కళ్ళు తళుక్కున మెరిసాయి.

"ఏమిటీ ఇంత లేటు? ఇకరావేమో అనుకుంటున్నాను" అన్నాడతను.

"ఏం చేయను. మా ఆయన్ను తప్పించుకొని రాలేక చచ్చిపోయాననుకో, క్యాంప్ వెళ్ళాడు. తను వెళ్ళగానే వచ్చాను. సారీ ఫర్ ది లేట్" అందామె అతని కళ్ళల్లోకి ఆరాధనగా చూస్తూ.

"ఇట్సాల్‌రైట్. అయినా నీ కోసం నిరీక్షిస్తుంటే ఎంతోమధురంగా ఉంది. జీవితంలో ఇలాంటి అనుభూతులే ఎప్పటికప్పుడు నూతనోత్సాహాన్ని అందిస్తాయి" ఆమె చేయినొక్కి చెప్పాడు అవినాష్.

అతని పొగడ్తకి అందంగా నవ్విందామె.

ఇద్దరూ అక్కడకు దగ్గరలో వున్న సినిమా థియేటర్‌కు నడిచారు.

కొన్నిరోజుల క్రితం శిరీషకు కడుపులో విపరీతంగా పెయిన్ వచ్చింది. ఆమె భర్త "వసంత నర్సింగ్‌హోం"లో చేర్చాడు. ట్రీట్‌మెంట్ తీసుకుంటూ ఓ వారం రోజులు అక్కడే ఉంది.

అక్కడే పరిచయమయ్యాడు అవినాష్.

చూపులుకలిసి, మాటలు పెరిగి, స్నేహం ఏర్పడిన తర్వాత ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఆకర్షణ కలిగింది.

అక్కడే ఇద్దరు ఒకటవటానికి ప్రయత్నం చేశారు. కానీ ఫలించలేదు.

శిరీషకు భర్తంటే ఇష్టమే. బట్, పరాయి మగాళ్ళంటే ఇంకా ఇష్టం. పరాయివాళ్ళతో తిరిగినపుడు భర్తను మోసం చేస్తున్నాననే భావం కలగదామెకు. తన సరదాలు, తన సుఖాలు, తన అభిప్రాయాలు తనవి.

అతని సరదాలు, సుఖాలు, అభిప్రాయాలు అతనివి. అతను ఇష్టంవచ్చినట్టు తిరిగినా శిరీష ఏమీ అనదు. అనుకోదు. అలాగని అతను శిరీషలా తిరగడు. అందంగా కనిపించిన ప్రతీ స్త్రీకి లోబడిపోడు.

చూడటానికి అందంగా ఉంటాడు. కానీ, ఒక్కటే లోపం. డబ్బు సంపాదనే జీవిత ధ్యేయం. బ్రతకటానికి సంపాదించినపుడు బాధలేదు. కానీ, అతను సంపాదించటానికే బ్రతుకుతున్నాడు.

ఇరవై నాలుగుగంటలూ బిజినెస్. టైము మిగిలితే నిద్ర... ఎప్పుడన్నా మూడ్‌వస్తే దగ్గరకు తీసుకుంటాడు. ఒళ్ళంతా తడుముతాడు. ముద్దులు పెట్టుకుంటాడు. పూర్తి సుఖాన్నివ్వకుండానే రెచ్చగొట్టి తప్పుకుంటాడు. దాంతో వయసు ప్రేటిగిపోయి, కోరిక విజృంభించి ఇలా పరాయివాళ్ళను వెతుక్కుంటుంది.

> ఇరవై నాలుగు గంటలూ బిజినెస్. టైము మిగిలితే నిద్ర... ఎప్పుడన్నా మూడ్‌వస్తే దగ్గరకు తీసుకుంటాడు. ఒళ్ళంతా తడుముతాడు. ముద్దులు పెట్టుకుంటాడు. పూర్తి సుఖాన్నివ్వకుండానే రెచ్చగొట్టి తప్పుకుంటాడు.

తనకు కావలసింది భర్త అందించలేనప్పుడు తనే వెతుక్కోవటంలో తప్పులేదని ఆమె అభిప్రాయం.

ఇద్దరూ సినిమా థియేటర్‌కు చేరుకున్నారు.

టిక్కెట్లు తీసుకొని రిజర్వుడు క్లాసులోకి నడిచారు. ఇద్దరూ మూలగావున్న సీట్స్ చూసుకొని కూర్చున్నారు

అదో పాత సినిమా కావటం మూలాన జనం అంతంతమాత్రంగానే వున్నారు.

వాళ్ళు సినిమా చూడటానికి రాలేదు. ఏకాంతం... ఏకాంతం కోసం వచ్చారు.

అవినాష్ ఏవేవో కబుర్లు చెప్పసాగాడు.

ఆమె తుళ్ళితుళ్ళి నవ్వుతోంది. నవ్వినపుడు జారిపోతున్న పైటలోకి రెండు కళ్ళను దూర్చుతున్నాడతను.

హాల్లో లైట్లారిపోయాయి. కొద్దిపాటి వెలుగుతప్ప లోపలంతా చీకటిగా ఉంది. ఆ చీకటికోసమే ఎదురుచూస్తున్న అవినాష్ ముందుకు ఒరిగి ఆమె పెదాలనందుకున్నాడు.

ఆమె కాదనలేదు.

సినిమా బిగినైంది. హీరో పొలం దున్నతూ ఉత్సాహంగా పాటపాడటం, అంతలో హీరోయిన్ అక్కడకు వచ్చి అతనిలోని గానకళకు ముగ్ధురాలై ప్రేమలోపడటం... తెరపై సినిమా వేగంగా జరిగిపోతోంది.

అవినాష్ చేతులు శిరీష వంటిపై ఎక్కడెక్కడో నర్తిస్తున్నాయి. ఏమేమో చేస్తున్నాడు.

"శిరీష! నువ్వంటే ప్రాణం నాకు. ఏ పూర్వజన్మ ఫలమో ఆ బ్రహ్మదేవుడు అందమైన శిల్పాన్ని చెక్కి దానికి ప్రాణంపోసి నాకు ప్రెజెంట్ చేశాడు" గుసగుసగా అన్నాడు చెవిలో.

అందుకు బహుమతిగా అతని పెదవులమీద తన పెదవులతో మెత్తగా స్పృశించింది శిరీష.

"దేవిగారి నగ్నదర్శనం ఎప్పుడో?"

"ఈ రాత్రికే! మా ఆయన రేపు ఉదయం వరకు క్యాంపులోనే ఉంటాడు. ఈ రాత్రంతా రసానుభూతిలో తేలిపోదాం."

"వండ్రఫుల్! అయితే గదిలో నీవు, నేను ఇద్దరం మంచంపై నగ్నంగా...." ఆనందంగా చెప్పసాగాడు అవినాష్.

అతను చెప్తుంటే కిసుక్కున నవ్విందామె.

ఆమె నవ్వుతోపాటూ మరో స్త్రీనవ్వింది కవ్వింపుగా.

ఉలిక్కిపడ్డారు ఇద్దరూ.

ప్రక్కకు చూశారు. తమలైన్‌లోనే కొంచెం దూరంగా మరోజంట.

ఎవరైనది చీకట్లో స్పష్టంగా తెలియటంలేదు.

పెద్దగా పట్టించుకోలేదు శిరీష.

కానీ, అవినాష్ పట్టించుకున్నాడు. దానికి కారణం — ఆ నవ్వును అతను చాలాసార్లు విన్నాడు. ఎక్కడ విన్నాడో సరిగ్గా గుర్తురావడంలేదు. ఎవరని ఆలోచించసాగాడతను. ప్రక్కనున్న శిరీషను కూడా మర్చిపోయాడు

ఇంటర్వెలైంది!

చప్పునలైట్లు వెలిగాయి.

హాలంతా వెలుగునింపుకొంది.

ఆత్రుతగా ఆ జంటకేసి చూశాడు అవినాష్.

అంతే!

నివ్వెరపోయాడు.

సునంద. తన భార్య సునంద. ఎదురింటి డిగ్రీ స్టూడెంట్ ప్రసాద్ ప్రక్కన కూర్చుని...




రాస్కెల్... పళ్ళు పటపటా కొరికాడు.

ఒక్కసారిగా అతనిలో కోపం. భార్యను పీకపిసికి చంపేయాలన్నంత కసి.

ఆమె ఎందుకీ పన్లు చేస్తోంది?

శిరీష తిరిగిందంటే ఓ అర్థం ఉంది.

భర్త దగ్గర ఆమెకు సుఖంలేదు. ఆ సుఖం కోసం తనలాంటివారిని వెతుక్కుంటుంది.

కానీ, 'ఆ విషయం'లో సునందకు ఎప్పుడూ లోటు చేయలేదు తను.

మరెందుకీ పనులు చేస్తోంది.

ఎప్పట్నుండి తననీ విధంగా మభ్యపెడుతుంది?

ఆలోచిస్తుంటే కళ్ళు ఎర్రగా అవుతున్నాయి.

పెదిమలు అదురుతున్నాయి.

పరాయివాడి భార్య తనతో తిరిగినా తప్పులేదు కానీ, తన భార్య పరాయివాడితో తిరుగుతోందంటే అతని మనసు తట్టుకోలేకపోతోంది.

అది పురుష నైజం!

శిరీష ఏదేదో మాట్లాడుతోంది.

అతనికేం వినిపించటంలేదు.

ఆలోచనలతో మెదడు మొద్దుబారిపోతోంది.

సినిమా ఇంకో పదినిముషాలలో అయిపోతుందనగా అతను తీసుకున్న నిర్ణయం—

సునందకు విడాకులివ్వాలని!